క్లుప్తంగా

సంస్కృతిని భావితరాలకు అందించాలి

కర్నూలు కల్చరల్: మన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాలని ఇస్కాన్ ప్రవచకులు వైష్ణోకృప చైతన్య ప్రభు అన్నారు. అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో భగీరథ కాంప్లెక్స్‌లోని శ్రీ పూరీజగన్నాథ మందిరంలో ఆదివారం వ్యాసపూర్ణిమ, నగర సంకీర్తన, భగవద్గీత శిక్షణా తరగతులు జరిగాయి. జగన్నాథ్, బలదేవ్, సుభద్ర మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. హరినామ సంకీర్తన, రాజభోగ హారతి, ఆశీర్వాదం, మహా ప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు భక్తులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు అర్జీలను సమర్పించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లోనూ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

వివాహిత ఆత్మహత్య

కర్నూలు (టౌన్): కర్నూలు మండలం భూపాల్ నగర్‌లో నివసించే వివాహిత ఆత్మహత్య చేసుకుంది. స్థానికంగా కాలనీలో మౌనిక, దుర్గాప్రసాద్ అనే ఇరువురు ప్రేమించుకొని పెళ్లి చేసుకున్నారు. భర్త కూలీ పనిచేసే వాడు. భార్య ఇంటి వద్దనే ఉంటుంది. వీరికి ఒక కుమార్తె ఉంది. ఇదిలాఉండగా ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మౌనిక (25) ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు భర్తకు సమాచారం ఇచ్చారు. అతడు హుటాహుటిన ఇంటికి చేరుకోగా అప్పటికే భార్య మృతి చెందింది. ఘటనపై కర్నూలు తాలుకా పోలీసులకు సమాచారం తెలిపారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

గణేష్ ఉత్సవాల్లో మట్టి విగ్రహాలనే పూజిద్దాం

కర్నూలు కల్చరల్: గణేష్ మహోత్సవాల్లో మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకొని పూజలు చేద్దామని శ్రీ గణేష్ మహోత్సవ కేంద్ర సమితి నగర అధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వరుడు, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే వినాయక చవితి ఉత్సవాల్లో స్థానిక ఉత్సవ కమిటీలు మట్టి విగ్రహాలనే ఏర్పాటు చేసుకోవాలని కోరుతున్నామన్నారు. నగరంలో కాలుష్యాన్ని నియంత్రించేందుకు ప్రతిఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని కోరారు. నగర శివారు డోన్ రోడ్డులోని వెంగన్న బావి సమీపంలో మట్టి వినాయక విగ్రహాల తయారీ కేంద్రం ఉందని, విగ్రహాలు కావాల్సిన వారు యజమాని కెనరాం పాల్ 95359 19826 నంబర్‌ను సంప్రదించవచ్చని సూచించారు.

సమాజంలో గురువులకు విశిష్ట స్థానం

కర్నూలు కల్చరల్: సమాజంలో గురువులకు విశిష్ట స్థానం ఉందని మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ అన్నారు. సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం హిందూ ఉపాధ్యాయ సమితి ఆధ్వర్యంలో వ్యాస జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ గురువు గొప్పతనాన్ని వివరించారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కేవీ సుబ్బారెడ్డి, ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్‌ప్రభు, లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి మాట్లాడారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా ఉత్తమ సేవలు అందించిన 125 మంది ఉపాధ్యాయులకు వ్యాసమహర్షి పురస్కారం, 30 మంది హైందవ వీరులకు ఛత్రపతి శివాజీ హైందవ శ్రేష్ఠ పురస్కారాలతో సన్మానించారు.

ముగిసిన న్యాక్ పర్యటన



కళాశాల డైరెక్టర్‌కు నివేదికను అందిస్తున్న న్యాక్ టీం సభ్యులు

కర్నూలు కల్చరల్: మైపర్ ఫార్మసీ కళాశాలలో రెండు రోజులు నేషనల్ అసెస్మెంట్ అక్రిడేషన్ కౌన్సిల్ (న్యాక్) పర్యటన ఆదివారం ముగిసిందని కళాశాల డైరెక్టర్ ఆదిమూలపు సతీష్ పేర్కొన్నారు. బెంగళూరు నుంచి వచ్చిన న్యాక్ బృందం కళాశాలలోని వివిధ విభాగాలు, అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం, ప్రయోగ శాలలు, ప్లేగ్రౌండ్‌ను పరిశీలించిందన్నారు. పూర్వ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ప్రస్తుత విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారన్నారు. కళాశాలలోని వసతులు, బోధన, ఫలితాలపై న్యాక్ టీం సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు. న్యాక్ కమిటీ నివేదికను తనకు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్‌రెడ్డికి అందజేశారన్నారు. అనంతరం కళాశాల అధ్యాపకులను డైరెక్టర్ ఆదిమూలపు సతీష్ అభినందించారు.

బకాయిలను చెల్లించాలి

కర్నూలు కల్చరల్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి డిమాండ్ చేశారు. స్థానిక ఎస్టీయూ భవన్‌లో ఆదివారం జరిగిన జిల్లా నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేయాలన్నారు. 12వ పీఆర్సీకి అనుగుణంగా మధ్యంతర భృతిని 30 శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు.

గురు దేవుళ్లకు వందనం

- జిల్లా వ్యాప్తంగా ఘనంగా వ్యాస మహర్షి జయంతి వేడుకలు
- భక్తులతో కిటకిటలాడిన సాయినాథుని ఆలయాలు
- భక్తిశ్రద్ధలతో సాయి నామ అఖండ భజనలు



సాయినాథుడిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులు



బాలాజీనగర్ ఆలయంలో పూజలందుకుంటున్న సాయినాథుడు


కర్నూలు కల్చరల్: వ్యాస మహర్షి జయంతి (గురుపూర్ణిమ)ను పురస్కరించుకొని ఆదివారం జిల్లావ్యాప్తంగా ప్రత్యేకంగా వేడుకలు నిర్వహించారు. సాయిబాబా, దత్తాత్రేయ స్వామి ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయినాథునికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, శ్రీ సాయి.. జయ జయ సాయి నామ అఖండ భజన, సామూహిక కుంకుమార్చనలు, హోమాలు, అన్నప్రసాద వితరణ తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు విశేషంగా జరిగాయి. సాయినాథునికి పల్లకీ సేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయాలన్నీ కిటకిటలాడాయి. భక్తులు స్వామివారిని దర్శించుకొని తరించారు. ఆధ్యాత్మిక, యోగా గురువులు, వివిధ పీఠాధిపతులను శిష్యులు, వీహెచ్‌పీ, బీజేపీ నాయకులు ఘనంగా సత్కరించి ఆశీర్వాదాలు పొందారు. ఇస్కాన్, చిన్మయ మిషన్, లలితా పీఠం, శాంతి ఆశ్రమం ట్రస్ట్, రామిరెడ్డి తాత ఆశ్రమం, పతంజలి యోగా, సాయినాథ యోగా కేంద్రాల్లో వేడుకలు వైభవంగా జరిగాయి. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆయా ఆలయాల కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి.

– కర్నూలు ఓల్డ్ సిటీలోని దక్షిణ షిర్డీసాయి బాబా ఆలయం, బాలాజీ నగర్, సరస్వతి నగర్, అశోక్‌నగర్ ప్రసన్నాంజనేయ ద్వారాక సాయినాథ ఆలయం, నెహ్రూనగర్‌లోని భగవాన్ సత్యసాయి మందిరం, సాయిబాబా సంజీవ నగర్‌లోని భగవాన్ బాలసాయి ఆశ్రమం, సూర్యనారాయణ స్వామి ఆలయం, నాగసాయి ఆలయం, వినాయక్ ఘాట్ ఆలయం, ఆదిత్యనగర్, సంకల్‌బాగ్ హరిహర క్షేత్రం తదితర ఆలయాల్లో గురుపూర్ణిమ వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్మయ మిషన్ జిల్లా బాధ్యులు సుప్రేమానంద, లలితా పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రహ్మణ్యం సందేశమిచ్చారు. గురువులు జీవిత మార్గదర్శకులని వారు సూచించిన మార్గంలో నడిచి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు.

– పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో కిడ్స్ వరల్డ్‌లో జరిగిన గురుపూర్ణిమ వేడుకల్లో యోగా శిక్షకులు టీవీ రత్నప్రసాద్, డాక్టర్ కేవీ సుబ్బారెడ్డిని యోగా కేంద్రం సభ్యులు నాగయ్య, శీను, నాగేశ్వర రావు, చంద్రమోహన్, పుష్పలత, తదితరులు ఘనంగా సన్మానించారు.

– పతంజలి సాయినాథ్ యోగా శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో వీఆర్ కాలనీ కేంద్రంలో యోగా గురువు పెరుమాళ్ల దత్తయ్య దంపతులను యోగా కేంద్రం సభ్యులు రంగస్వామి, కేశవరావు, సుచరిత, రామ సుబ్బమ్మ తదితరులు ఘనంగా సన్మానించారు.

– చిన్మయ మిషన్ జిల్లా బాధ్యులు స్వామిని సుప్రేమానంద, లలితా పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రహ్మణ్యం స్వామి, ఉత్తారాది మఠం అధికారి పగడాల రామ్మూర్తి ఆచార్యులు, సదానంద, స్వాత్మానంద, భానుమతమ్మలను వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ, ఉపాధ్యక్షుడు గోవిందరాజులు, కోశాధికారి అయోధ్య శ్రీనివాస్, బజరంగ్‌దళ్ నాయకులు సన్మానించారు.



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

కల్లూరు: గురు పౌర్ణమి సందర్భంగా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి బి.క్యాంపు పోస్టాఫీస్ దగ్గర ఉన్న శంకర మందిరం సాయి బాబా ఆలయం, ఆరోరా నగర్‌లోని నాగ సాయిబాబా ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్ని భక్తులకు స్వయంగా వడ్డించారు.



లలితా పీఠంలో వేదవ్యాసుని చిత్ర పటం వద్ద భక్తులు



హారతి తీసుకుంటున్న భక్తులు



బాలాజీనగర్ ఆలయంలో భక్తుల క్యూ







యోగా గురువు దత్తయ్య దంపతులను సన్మానిస్తున్న శిష్యులు, సూర్యనారాయణ స్వామి ఆలయంలో సామూహిక పూజల్లో భక్తులు, తుంగభద్ర నదీ తీరంలోని సాయిబాబా ఆలయంలో భక్తుల రద్దీ



భక్తులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ చాటండి

కర్నూలు (టౌన్): సెప్టెంబర్ మొదటి వారంలో నిర్వహించనున్న 49వ రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ చాటాలని కపిల్ చిట్ ఫండ్ మేనేజర్ శ్రీకాంత్ స్పష్టం చేశారు. స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లాస్థాయి యోగా పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. 8 నుంచి 10 సంవత్సరాల్లోపు బాల బాలికల విభాగంలో రేహ, వినూత్న, శ్రీలౌక్య, అయేష, తనుజా, సాత్విక్ 10 నుంచి 12 సంవత్సరాల్లోపు విభాగంలో మనుశ్రీ, హరిప్రియ, భూమిక, సాకేత్, సాయిచరణ్, యశ్వంత్‌సాయి 12 నుంచి 14 ఏళ్ల విభాగంలో ఆస్మిత, శ్యామల, ఫరీదాబేగం, లిఖిత్ 14 నుంచి 16 ఏళ్ల విభాగంలో స్నేహ, తేజ, విష్ణు, హేమంత్ రెడ్డి, 16 నుంచి 18 ఏళ్ల విభాగంలో తస్లీమా, పల్లవి, శృతి, 18 నుంచి 21 ఏళ్ల విభాగంలో ఐశ్వర్య, తబస్సు ధన ధీరజ్ పతకాలు సాధించారు. యోగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి, అంతర్జాతీయ యోగా క్రీడాకారుడు శేషఫణి, జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి డాక్టర్ రుద్రారెడ్డి పాల్గొన్నారు.



యోగా విజేతలకు పతకాలు అందజేసిన అతిథులు

మొక్కలు నాటి సంరక్షించాలి

కర్నూలు(అగ్రికల్చర్): ప్రతిఒక్కరూ ఒక మొక్కను నాటి పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేయాలని జిల్లా జాయింట్ డైరెక్టర్ జి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జాతీయ పశువైద్య సంఘం ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం జిల్లా పశువైద్య అధికారుల సంఘం, జిల్లా పశువైద్య సహాయ శస్త్రచికిత్సకుల సంఘం ఆధ్వర్యంలో కొండారెడ్డి బురుజు, బహుళార్ధ పశు వైద్యశాలలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. జేడీ జి.శ్రీనివాస్ దంపతులతో పాటు డీడీలు, ఏడీలు, పశువైద్యులు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ.. మొక్కలు నాటడమే కాదు... వాటిని సంరక్షిస్తేనే ఫలితం ఉంటుందని వివరించారు. పచ్చదనం తగ్గడం వల్ల నేడు కరువులు, కాటకాలు వంటి వాటితో పాటు కాలుష్యం ఏర్పడి పర్యావరణం దెబ్బతింటోందని పేర్కొన్నారు. జిల్లా పశువైద్య అధికారుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ మల్లన్న, సహాయ శస్త్రచికిత్సకుల సంఘం అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, సెక్రటరీ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న పశువైద్య అధికారులు

ఒలింపిక్స్‌లో పతకాలు సాధించాలి

కర్నూలు (టౌన్): ఈనెల 28 నుంచి ప్యారిస్‌లో నిర్వహిస్తున్న ఒలింపిక్స్ క్రీడల్లో దేశ, రాష్ట్ర క్రీడాకారులు పతకాలే లక్ష్యంగా సత్తాచాటాలని మాజీ మంత్రి కె.ఇ.ప్రభాకర్ స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియం నుంచి క్రీడాకారులతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని మాజీ మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు కేయి.జగదీష్‌కుమార్, సీఈఓ విజయ్‌కుమార్, కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కర్నూలు (టౌన్): ఉమ్మడి జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం పొంది ప్రమాదవశాత్తు మరణించిన వారి కుటుంబాలకు ఆదివారం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు రూ.5 లక్షల చెక్కు పంపిణీ చేశారు. ఆయనతో పాటు పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ చింతా సురేష్ బాబు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలందరూ క్రియా శీలక సభ్యత్వం, బీమా సౌకర్యం పొందాలని సూచించారు.

మెదడును కాపాడుకుందాం

- పెద్దాసుపత్రిలో న్యూరో జబ్బులకు ఆధునిక సేవలు
- ఈఈజీ, ఈఎంజీ పరీక్షలు నిర్వహణ
- పది పడకలతో స్ట్రోక్ యూనిట్
- రూ.50 వేలు విలువైన ఇంజెక్షన్లు
- నేడు అంతర్జాతీయ మెదడు దినోత్సవం



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని బ్రెయిన్ స్ట్రోక్ యూనిట్‌లో చికిత్స పొందుతున్న రోగులు

కర్నూలు(హాస్పిటల్): కొన్ని వేల కంప్యూటర్ల కంటే ఎక్కువ జ్ఞాపకాలను మన మదిలో నిక్షిప్తం చేసుకోవచ్చు. కంప్యూటర్‌లో జ్ఞాపకాలు చెరిగిపోతాయేమో గానీ మెదడులో నిక్షిప్తమై ఉన్న ఆలోచనలు, జ్ఞాపకాలు ఎన్నటికీ చెరగిపోవు. అలాంటి మెదడుకు చిన్నపాటి దెబ్బతగిలితే పరిస్థితి చేయిదాటిపోతుంది. అందుకే దీన్ని పదిలంగా కాపాడుకునేందుకు వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ న్యూరాలజీ ఏటా జూలై 22న అంతర్జాతీయ మెదడు దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ప్రతి సంవత్సరం కొత్త లక్ష్యంపై దృష్టి పెడుతుంది. ఈ ఏడాది లక్ష్యం 'బ్రెయిన్ హెల్త్ అండ్ ప్రీవెన్షన్'. 2021 గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్ స్టడీ ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 3.4 బిలియన్ ప్రజలు న్యూరాలజీ జబ్బులతో బాధపడుతున్నారు. 11.1 మిలియన్ ప్రజలు చనిపోతున్నారు. కొన్ని న్యూరాలజీ జబ్బులకు పూర్తిగా నయం చేసే చికిత్సలు అందుబాటులో లేవు. ఇలాంటి జబ్బులను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు అవసరమైన అవగాహన కల్పించడం తప్పనిసరి. జాగ్రత్తలు తీసుకోవడం ప్రధానం

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల న్యూరాలజీ విభాగానికి ప్రతి సోమ, గురువారాల్లో ఓపీ చికిత్స అందిస్తారు. గత ప్రభుత్వ హయాంలో ఈ విభాగంలో పోస్టులన్నీ భర్తీ అయ్యాయి. ప్రస్తుతం ఒక ప్రొఫెసర్ డాక్టర్ సి.శ్రీనివాసులు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్యామసుందర్, డాక్టర్ సౌజన్య విధులు నిర్వర్తిస్తున్నారు. వీరితో పాటు ఇటీవల రెండు పీజీ సీట్లు మంజూరు కావడంతో ఇద్దరు యువ వైద్యులు ఇక్కడ చదువుతూ రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ విభాగంలో ఫిట్స్, స్ట్రోక్, పార్కిన్సన్, ఆప్టిక్ న్యూరైటిస్, న్యూరో మస్కులర్ డిసీజ్, మెడ నొప్పులు, కాళ్ల పాదాల నొప్పులు, సయాటికా, న్యూరోపతి వంటి అనేక రకాల నరాల జబ్బులకు చికిత్స అందిస్తున్నారు. నగరంలోని ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ ప్రస్తుతం 30 మంది దాకా న్యూరాలజిస్టులు ఉన్నారు. వీరి వద్దకు ప్రతిరోజూ 40 నుంచి 80 మంది దాకా చికిత్స కోసం వస్తున్నారు. ఇందులో పక్షవాతం రోగులే 10 శాతం వరకు ఉంటున్నారు.

పక్షవాతం యూనిట్ ఏర్పాటు

న్యూరాలజీ విభాగానికి గతంలో స్ట్రోక్ యూనిట్ ఉండేది కాదు. ఇటీవల స్ట్రోక్ బాధితులు అధికంగా వస్తుండటంతో గత ప్రభుత్వం పది పడకలతో స్ట్రోక్ యూనిట్ ఏర్పాటు చేసింది. ఇందులో ఐసీయూ ఏర్పాటు చేసి వెంటిలేటర్లు, సక్షన్ ఆపరేటర్లు, ఆక్సీజన్ పైపులైన్, సెంట్రల్ ఏసీ ఏర్పాటు చేయడంతో కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా అందుతోంది. సకాలంలో చికిత్స కోసం వచ్చిన స్ట్రోక్ బాధితులకు రూ.50 వేల విలువ గల టీపీఏ (టిష్యూ ప్లాస్మినోజన్ యాక్టివేటర్) ఇంజెక్షన్‌ను ఉచితంగా వేస్తున్నారు.

పక్షవాతానికి కారణాలు

యువత ఎక్కువగా బ్రెయిన్ స్ట్రోక్‌కు గురవడానికి ప్రధాన కారణం స్మోకింగ్, ఆల్కహాలు (పొగ తాగడం, మద్యపానం). జీవన విధానంలో మార్పులు, రక్తపోటు, మధుమేహం, ఎక్కువ కొలెస్ట్రాల్, ఊబకాయం, గుండెజబ్బులు, ఈస్ట్రోజన్ కలిగి ఉన్న హార్మోన్ థెరపీలు, గర్భనిరోధక మాత్రలు వాడిన మహిళల్లో స్ట్రోక్ వచ్చే అవకాశం ఎక్కువ. కొంత మందిలో పుట్టుకతోనే జన్యుపరమైన లోపాల కారణంగా రక్తం గడ్డ కట్టే గుణం ఉండి పక్షవాతం రావచ్చు. అన్యూరిజం వంటి రక్తనాళాల గోడలు బలహీనంగా ఉండటం వల్ల పక్షవాతం రావచ్చు.

చికిత్సా విధానాలు

స్ట్రోక్ వచ్చిన తరువాత మొదటి 4–5 గంటలు అత్యంత కీలకం. రక్తనాళంలో అడ్డంకుల వల్ల వచ్చే స్ట్రోక్‌లో అల్టెప్లేజ్ లేదా టీనక్ట్ ప్లేజ్ అనే ఇంజెక్షన్ ఇవ్వడం వల్ల రక్తప్రవాహాన్ని పునరుద్ధరించవచ్చు. ఈ విధానంలో తొలగించలేని పెద్ద గడ్డలను కరోటిడ్ ఎండారెక్టమి ద్వారా తగ్గించవచ్చును. రక్తం పలచగా చేసే మందులు రెగ్యులర్‌గా వాడాల్సిన అవసరం ఉంటుంది.

పక్షవాతాన్ని గుర్తించడం ఎలా...?

- ఒకవైపు చేయి, కాలు పనిచేయకపోవడం, నడవడానికి ఇబ్బంది పడటం
- అకస్మాత్తుగా తల తిరగడం, శరీరం బ్యాలెన్స్ కోల్పోవడం
- మూతి ఒకవైపునకు వంకరగా పోవడం
- మాట్లాడే విధానం సరిగా లేకపోయినా స్ట్రోక్‌గా అనుమానించాలి
- సీటీ స్కాన్, ఎంఆర్ఐ బ్రెయిన్ పరీక్షల ద్వారా బ్రెయిన్ స్ట్రోక్‌ను నిర్ధారిస్తారు.

పెద్దాసుపత్రిలో అత్యాధునిక చికిత్స



న్యూరాలజీ విభాగంలో అత్యాధునిక వసతులు, సౌకర్యాలు, వైద్య పరికరాలతో రోగులకు నాణ్యమైన చికిత్స అందిస్తున్నాం. దీనివల్ల ఒకప్పుడు ప్రైవేటుకు వెళ్లే స్ట్రోక్ బాధితులు ఇక్కడికే చికిత్స కోసం వస్తున్నారు. మా విభాగంలో నిత్యం 70 నుంచి 80 మంది రోగులు ఇన్‌పేషంట్లుగా చికిత్స పొందుతున్నారు. ఇక్కడి వైద్యులను నమ్మి వస్తున్న వారికి పూర్తిస్థాయిలో చికిత్స చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. రికవరీ రేటు పెరగడంతో ప్రజల్లో నమ్మకం రెట్టింపైంది. – **డాక్టర్ సి.శ్రీనివాసులు, న్యూరాలజీ విభాగాధిపతి, జీజీహెచ్, కర్నూలు**


విత్తన విక్రయాల్లో నిబంధనలు పాటించాలి



ఇన్‌పుట్ డీలర్లు తయారు చేసిన రిజిస్టర్లను ప్రదర్శిస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): చట్టాలకు లోబడి ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు విక్రయించాలని విశ్రాంత జేడీఏ, దేశీ డిప్లొమా కోర్సు సమన్వయకర్త జయచంద్ర ఇన్‌పుట్ డీలర్లకు సూచించారు. ఆదివారం జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం సమావేశ మందిరంలో ఇన్‌పుట్ డీలర్లకు దేశీ డిప్లొమా కోర్సుపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయాల్లో పాటించాల్సిన నిబంధనలు, రిజిస్టర్ల నిర్వహణపై అవగాహన కల్పించారు. గోదాముల్లో విత్తనాలు, ఎరువులను ఒకేచోట ఉంచరాదన్నారు. పురుగు మందులు, కలుపు మందులను రైతులకు ఇచ్చేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఒకసారి వాడిన డబ్బాల్లో మందు మిగిలితే ఇంట్లో భద్రపరచాలని, పిల్లలకు అందుబాటులో ఉంచరాదన్నారు. వ్యవసాయ చట్టాలకు అనుగుణంగా మార్గదర్శకాలు పాటించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డీలర్లకు సెమినార్ నిర్వహించారు. ఇన్‌పుట్ డీలర్లు తయారు చేసిన రిజిస్టర్లను ప్రదర్శించారు.

ఆరోగ్య అవగాహన పెంపొందించుకోవాలి



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కమ్యూనిటీ మెడిసిన్ హెచ్ఓడీ డాక్టర్ సుధాకుమారి

కర్నూలు(హాస్పిటల్): ప్రజలు ఆరోగ్య అవగాహన పెంపొందించుకోవాలని కర్నూలు మెడికల్ కాలేజీ కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ సుధాకుమారి సూచించారు. నేషనల్ మెడికల్ కమిషన్ ఆదేశాల మేరకు.. ఫ్యామిలీ అడాప్షన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక బుధవారపేటలోని 14వ వార్డులో 2022 బ్యాచ్ సెకండియర్ వైద్య విద్యార్థులు స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకుమారి మాట్లాడుతూ.. ఫ్యామిలీ అడాప్షన్ కార్యక్రమంలో భాగంగా ఒక్కో వైద్య విద్యార్థికి మూడు గృహాల చొప్పున మొత్తం 750 గృహాలు కేటాయించినట్లు చెప్పారు. విద్యార్థులు వారికి కేటాయించిన గృహాల సందర్శనలకు వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకుని వైద్య శిబిరానికి తీసుకువస్తారన్నారు. జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్, ఎన్‌సీడీ కింద రోగులను వైద్యులు పరీక్షించారన్నారు. బాడీ మాస్ ఇండెక్స్ కోసం ఎత్తు, బరువు, చుట్టుకొలతలు తీసుకుని వయస్సుకు తగ్గ ఎత్తు, బరువు ఉన్నారా లేదా పోషకాహార లోపంతో బాధపడుతున్నారా అని గుర్తించి వారికి చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రొఫెసర్ డాక్టర్ సింధియా శుభప్రద, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రేణుక, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవినాయక్, డాక్టర్లు నాగరాజు, వైష్ణవి, కె.మమత, శివానందన్, లక్ష్మీ శైలజాదేవి, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నామినేషన్లు

కర్నూలు (టౌన్): నగరపాలక స్టాండింగ్ కమిటీ ఎన్నికకు ఆదివారం మరో నామినేషన్ దాఖలైంది. స్థానిక నగరపాలకలో మేనేజర్ చిన్నరాముడుకు 15వ వార్డు కార్పొరేటర్ (టీడీపీ) ఎస్.శివమ్మ తన నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఇప్పటివరకు ఐదుగురు సభ్యుల స్టాండింగ్ కమిటీ ఎన్నికకు నలుగురు కార్పొరేటర్లు నామినేషన్లు దాఖలు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక కార్యదర్శి నాగరాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

నాలుగేళ్లకు తొలిసారిగా...

నగరపాలక సంస్థకు 2021 సంవత్సరంలో పాలకవర్గం ఏర్పడింది. మెజార్టీ వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ఉండటంతో ఏడాదికోసారి నిర్వహించే స్టాండింగ్ కమిటీ ఎన్నికలు పోటీలేకుండా ఐదుగురు కార్పొరేటర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యేవారు. అయితే తొలిసారి నాలుగవ ఏడాదికి నిర్వహించనున్న స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి చెందిన కార్పొరేటర్ నామినేషన్ దాఖలు చేశారు. కాగా సార్వత్రిక ఎన్నికల ముందు, ఆ తరువాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కర్నూలు, పాణ్యం, కోడుమూరు ఆర్బన్ నుంచి 8 మంది కార్పొరేటర్లు టీడీపీలో చేరారు. దీంతో 9 మంది ఉన్న కార్పొరేటర్ల సంఖ్యా బలం 17కు చేరింది. బలం పెరగడంతో స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పాల్గొనేలా నిర్ణయించుకున్నారు. ఈ సారి పోటీ అనివార్యం అయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి.